క్లుప్తంగా

18న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం గ్రామం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి వెంబడి వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు ఈనెల 18వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తిరునాళ్ల వేడుకలు సందర్భంగా గ్రామస్తులు రెండు విద్యుత్ ప్రభలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి పూట ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా తిరునాళ్ల జరిగే ఏరియాను పరిశీలించారు.

తిరునాళ్లు విజయవంతం చేయాలి



వినుకొండ: మండలంలోని మదమంచిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవ ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో తిరునాళ్లకు ప్రజలకు తరలివస్తారని, అన్ని శాఖల వారు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, హెల్త్, ఫైర్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి సాయం చేద్దాం



వినుకొండ : ప్రతి విద్యార్థి నిజాయితీ క్రమశిక్షణతో ఆపదలో ఉన్నవారికి సాయం చేయడానికి ముందుకు రావాలని పాఠశాల హెచ్ఎం పి.హవీలా తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్ అండ్ గైడ్స్ ట్రూప్ యూనిట్‌కు ఎంపికైన 26 మందికి యూనిఫాంను అందజేశారు. ఈ సందర్భంగా స్కౌట్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ పీడీ ఉదయరాజు, టీచర్లు డి.జ్యోతి, ఎ.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బర్లీ పొగాకు రైతుల ధర్నా

చిలకలూరిపేట: బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, సీపీఎం నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొంటారన్నారు. రైతులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఎంపీపీ స్కూల్లో నూతన అడ్మిషన్లు ప్రారంభం



శావల్యాపురం: 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో నూతన అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయులు బిళ్లా రాజా రమేష్ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ పాఠశాలలో 1వ తరగతిలోని విద్యార్థులను చేర్చుకునేందుకు ఇంటింటికీ తిరిగి ప్రచారం ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పించుతున్న సౌకర్యాలు వసతులు తదితర వాటి గురించి వివరించామన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు డి.రవికుమార్ ఉన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దారుగా సురేష్ నాయక్

ఈపూరు(శావల్యాపురం): మండల ఇన్‌చార్జ్ తహసీల్దారుగా వినుకొండ తహసీల్దారు సబవత్ సురేష్‌నాయక్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తహసీల్దారు వ్యక్తిగత పనులపై సెలవుపై వెళ్లారు. వచ్చే నెల 4వ తేదీ వరకు వినుకొండ తహసీల్దారు సురేష్ నాయక్ ఇన్‌చార్జ్ బాధ్యతలు వ్యవహరిస్తారని తహసీల్దారు కార్యాలయ సీనియర్ సహాయకులు షేక్ షైదా మంగళవారం తెలిపారు.

దాహం... దాహం..



- గుమ్మనంపాడు ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి
- మరమ్మతులకు గురైన మోటారు

బొల్లాపల్లి: మండలంలోని గుమ్మనంపాడు ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడితో అగచాట్లు తప్పడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. మోటారు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని కాలనీవాసుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా మోటారు చెడిపోయి నీటిసరఫరా నిలిచింది. పలుమార్లు పంచాయతీ పాలకులకు ఈ విషయాన్ని కాలనీ వాసులు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం సమయానికి తాగడానికి కూడా నీళ్లు లభించక నానా పాట్లు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకర్లతో అరకొరా!

ఇటీవల ట్యాంకర్లతో నీటిసరఫరా ప్రారంభించినప్పటికీ మూడు రోజులకొకసారి ట్యాంకర్లతో నీటిసరఫరా జరుగుతోంది. ఇది కూడా సరిపడినంత నీళ్లు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటారు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మోటారు రిపేరు చేయించండి



కాలనీలో నీటిసరఫరా లేక ఇబ్బంది పడుతున్నాం. ట్యాంకర్లతో పోసినా నీరు సరిపోవడం లేదు. గతంలో విడిగా కాలనీకి నీరు వచ్చేవి. మోటారు రిపేరుకు రావడంతో నీరు నిలిచిపోయాయి. మోటారు మరమ్మతులు చేయించండి. –ఎల్.మౌనిక, కాలనీ వాసి.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు



గణపవరంలో నిర్మాణంలో ఉన్న అచల దాసునాయన మఠం

నాదెండ్ల: గణపవరం సినిమా హాల్ రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణాంజనేయ స్వామి ఉపాసకులు అచల దాసునాయన మఠం ఆరాధనోత్సవాలు మూడు రోజుల పాటూ జరగనున్నాయి. ఈ నెల 16,17,18 తేదీల్లో ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. 1929లో ఆశ్రమాన్ని 1.62 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. 1946లో గ్రామానికి చెందిన కెల్లంపల్లి వీరయ్య, రాయిపాటి పున్నయ్యలు మఠం నిర్మాణానికి పూనుకున్నారు. దాసునాయన తన శిష్యులచేత అనేక భక్తి వేదాంత కార్యక్రమాలు జరుపుతూ జీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి నేటి వరకూ ప్రతి ఏడాది ఏప్రిల్‌లో భక్తుల పూజల అందుకుంటూ పుణ్యపురుషుడు శ్రీ అచల దాసునాయన స్వామి సకల కామితార్థములు నొసగుతూ కోరికలు నెరవేర్చు కల్పవృక్షమై వెలుగుతున్నారు. మొదటి రోజు 16న ఉదయం 9 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం, పెదనందిపాడు శ్రీరామ నామామృత భక్త సమాజం వారిచే బీఎస్ఆర్ ఆంజనేయులు గురూజీచే ప్రవచనాలు, 17న ఉదయం గీతాపారాయణం, మధ్యాహ్నం చాగంటి వారిపాలెంకు చెందిన అన్నపరెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రవచనాలు, 18న ఉదయం జీవసమాధికి పూజలు, వీహెచ్‌పీ కార్యకర్తలచే కోకల వెంకటరావు ఆధ్వర్యంలో హరేనామ సంకీర్తన, వేటపాలెంకు చెందిన బ్రహ్మశ్రీ శివకేశవ గురూజీ ఆధ్వర్యంలో ప్రవచనాలు, అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులకు సన్మానం, సాయంత్రం అచల దాసునాయన జెండా ఊరేగింపు జరుగుతుంది. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించనున్నారు.

సీసీ కెమెరాల దొంగతనం అవాస్తవం

రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామంలో గల శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో సీసీ కెమెరా, మానిటర్‌లను చోరీకి గురయ్యాయని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ మేరకు చోరీకి సంబంధించిన వీడియో కూడా వైరల్ అయ్యింది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో వివరణ కోరగా సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం అవాస్తవం అన్నారు. ఆలయంలోని సీసీ కెమెరా, మానిటర్‌లు మెకానిక్‌లు మరమ్మతుల నిమిత్తం తీసుకువెళ్లారన్నారు. ఆలయంలో ఎలాంటి చోరీ జరగలేదని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, మండలంలోని బోయపాలెం గ్రామానికి చెందిన షేక్ అల్లాభక్షు (40) ఈ నెల 8న వ్యక్తిగత పనుల కోసం ద్విచక్ర వాహనంపై చేబ్రోలు వెళ్లి తిరిగి వస్తుండగా, చేబ్రోలు-నారాకోడూరు మార్గంలో గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ, శనివారం (12వ తేదీ) అల్లాబక్ష మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రైల్వేస్టేషన్లో చలివేంద్రం ప్రారంభం



నరసరావుపేట: వేసవిని పురస్కరించుకొని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో 1983 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని మంగళవారం గుంటూరు రైల్వే స్టేషన్ ఏవో ఎం.ముఖేష్‌సింగ్ ప్రారంభించారు. రైల్వేస్టేషన్‌కు రాకపోకలుసాగించే ప్రయాణీకులతో పాటు పట్టణ ప్రజలకు చలివేంద్రం ప్రయోజనకరంగా ఉంటుందని పూర్వ విద్యార్థి అయిన స్థానిక రైల్వేస్టేషన్ సూపరిండెంట్ షేక్ బాజాన్ అన్నారు. పూర్వ విద్యార్థులు పొట్టి ఆంజనేయులు, బీఎస్ రామకృష్ణ, కె.అంజిరెడ్డి, షేక్ సుభాని, శాస్త్రి, గఫార్, శంకర్ పాల్గొన్నారు.

వినుకొండలో పేదలకు అన్నదానం



వినుకొండ: చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో ఎండీ రాజు చేతుల మీదుగా అన్నం పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.రమేష్‌బాబు, ఎం.ప్రవళిక, ఎస్.బ్రహ్మయ్య, వెంకటకృష్ణ, శ్రీను, వీరాంజి, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి



రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నరసరావుపేటటౌన్: ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నరసరావుపేట అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ ప్రమాదాల నివారణపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.

వినుకొండలో అగ్నిమాపక వారోత్సవాలు

వినుకొండ: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా 2వ రోజు పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్, వెన్నెల సూపర్‌మార్కెట్, కీర్తిహాల్ నందు సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవిలో జరిగే అగ్నిప్రమాదాలపై, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కె.శ్రీనివాసరావు, డ్రైవర్, ఆపరేటర్స్ ఎస్వీ రమణారెడ్డి, కె.రవికుమార్, ఫైర్ మెన్స్ ఎస్. కేశవబాబు, జి. ప్రభాకరరెడ్డి, ఎం. కోటేశ్వరరావు, ఎస్‌కే మస్తాన్, ఎం. మల్లికార్జునరావు, హోంగార్డ్స్ జి.రామకృష్ణారావు, పి. బాషా ఖాన్, డి.మస్తాన్ వలి, ఎ. శ్రీను పాల్గొన్నారు.

అగ్ని మాపక సాధనాలు పనిచేసేలా చూసుకోవాలి

చిలకలూరిపేట: అగ్ని ప్రమాదాల నివాణకు అగ్నిమాపక సాధనాలను ఎల్లప్పుడూ పనిచేసే విధంగా ఉంచాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆర్టీసీ సిబ్బందికి అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీ, ఇతర విద్యుత్ ఉపకరణాలలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా క్రమం తప్పకుండా పరీక్షిస్తుండాని చెప్పారు. విద్యుత్ ఉపకరణాల పనితీరును తరుచుగా పర్యవేక్షించాలని చెప్పారు. చమురు లీకులు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ మరమత్తులు సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్ తో మాత్రమే చేయించాలని వెల్లడించారు.

విద్యుత్ పరికరాలకు నిప్పంటుకుంటే నీళ్లతో ఆర్పకూడదని, దీనివల్ల షాక్ తగిలి ప్రాణాపాయం కలగవచ్చని హెచ్చరించారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రాంబాబు, గ్యారేజ్ సిబ్బంది, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్‌వో కిరణ్‌కుమార్‌రెడ్డి

వెయ్యి రోజుల సంరక్షణపై శ్రద్ధ చూపండి



పక్షోత్సవాల్లో ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్‌వైజర్

బొల్లాపల్లి: మండలంలోని నాయుడుపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పక్షోత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మొదటి వెయ్యి రోజుల సంరక్షణ పై శ్రద్ధ వహించాలన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు 270 రోజులు, బిడ్డ పుట్టినప్పటి నుంచి 24 నెలల పాటు 730 రోజులతో కలిసి వెయ్యి రోజుల వరకు బిడ్డ సంరక్షణకు జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహార లోపాన్ని నివారించడం, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవన శైలితో పాటు వ్యాధి నిరోధక టీకాలు అందించడం గురించి తెలియజేశారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలత నమోదు చేశారు. చిన్నారుల్లో లోపాలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించడం, ఆరోగ్యకరంగా ఉండేందుకు చేపట్టాల్సిన విధి విధానాల గురించి పక్షోత్సవాల్లో సీడీపీవో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

హనుమత్ దీక్షా స్వాముల ప్రత్యేక పూజలు



కలిశ ప్రతిష్టాపన చేస్తున్న హనుమత్ దీక్షా స్వాములు

నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్లలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ దీక్ష స్వాములచే స్వామి వారి పీఠం, కలిశ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం జరిగింది. చైత్రమాసం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. 41 రోజుల పాటు జరిగే మండల దీక్ష మే 22వ తేదీ హనుమత్ జయంతిన ముగుస్తుందని ప్రదాన అర్చకులు క్రోసూరి రామమోహనాచార్యులు తెలిపారు. అప్పటి వరకూ దీక్షా స్వాములచే స్వామి వారికి పంచామృతాభిషేకాలు, సాయంకాలం ప్రత్యేక పూజ, హరిరామ సంకీర్తన భజనా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మనమిత్ర వాట్సప్ సేవలను సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: మన మిత్ర వాట్సప్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రం శావల్యాపురం బీసీ కాలనీలో పర్యటించి ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన వాట్సప్ సేవల గురించి కాలనీవాసులకు కర పత్రాల అందజేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మన మిత్ర వాట్సప్ యాప్ ద్వారా ఈ-ధ్రువీకరణ పత్రాలు రశీదులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునన్నారు. చెల్లింపులు భద్రతతో కూడిన ఒక పేమెంటు లింకు తెలుసుకోవచ్చునన్నారు. సర్వీసు విధానంపై గురించి లబ్ధిదారులు తెలుసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మనమిత్ర (వాట్సప్ గవర్నెన్స్) సెల్ నంబరు 9552300009 సంప్రదించి ప్రభుత్వం అందించే సేవలు గురించి తెలుసుకోవచ్చున్నారు. ఆయనతో పాటు మహిళా పోలీసు గౌసియాబేగం, ఇంజినీరింగ్ సహాయకులు రంతు లక్ష్మణ్, వీఏఏ వెంకయమ్మ, కోవిడ్ తదితరులు ఉన్నారు.

తప్పు చేసి.. గుంజిళ్లు తీసి...!



ద్విచక్ర వాహనాలపై పరిమితికి మించి ప్రయాణిస్తున్న అధికారులు చర్యలు తీసుకోకపోవటం పలు విమర్శలకు తావిస్తుంది. యథేచ్ఛగా ద్విచక్ర వాహనాలపై ముగ్గురు లేక నలుగురు ప్రయాణిస్తూ కనిపించటం ఆందోళన కలిగిస్తుంది. మంగళవారం ద్విచక్ర వాహనంపై నలుగురు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తూ కనిపించారు. మల్లమ్మ సెంటర్ మీదుగా ఓవర్ బ్రిడ్జి పై నుంచి కళాశాలకు వెళ్లారు. ముగ్గురు యువకులు సీటుపై కూర్చోగా మరో యువకుడు ట్యాంక్ పై కూర్చున్నాడు. ఎదురు వాహనం వస్తే హ్యాండిల్ తిప్పలేని పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాన్ని నడుపుకుంటూ వెళ్లారు. ఒకే వాహనంపై నలుగురు యువకులు ప్రయాణిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై స్పందించిన వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ నంబర్ ఆధారంగా వాహనాన్ని గుర్తించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించిన నలుగురు యువకులను స్టేషన్‌కు పిలిచి గుంజిళ్లు తీయించారు. మరోమారు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

–నరసరావుపేట టౌన్

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో అనర్థమే

- ఎక్కడబడితే అక్కడ పడేయవద్దు
- రీసైక్లర్లకు మాత్రమే అందజేయాలని కోరిన కమిషనర్

నరసరావుపేట: పర్యావరణానికి హానికలిగించే ఎలక్ట్రానిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయకుండా సక్రమైన పద్ధతిలో మళ్లీ వినియోగించుకోవటానికి వీలుగా రీసైక్లర్‌లకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పట్టణ ప్రజలను కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమర్థవంతమైన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలుచేసి ఉపయోగించాలని సూచించారు. ఫోన్లు, టీవీలు, కంప్యూటర్ మానిటర్ స్క్రీన్లలో ఉండే సీసం మానవులకు మూత్రపిండాలు, నరాలు, రక్తం, ఎముకలు, పునరుత్పత్తి అవయవాలు, కండరాలను దెబ్బతీస్తుందన్నారు. ఫ్లాట్‌స్క్రీన్ టీవీలు, ల్యాప్‌టాప్ స్క్రీన్లు, ఫ్లోరోసెంట్ బల్బుల్లో ఉండే పాదరసం మూత్రపిండాలు, నాడీ వ్యవస్థకు హాని కలిగిస్తుందన్నారు. కేబుల్స్, ప్లాస్టిక్ కేసు ఉండే బ్రోమినేటెడ్ జ్వాలా నిరోధకాలు క్యాన్సర్, కాలేయ పనితీరుకు అంతరాయం, నరాల నష్టాన్ని కలిగిస్తాయన్నారు. పునర్వినియోగపర్చబడిన బ్యాటరీలో ఉండే కాడ్మియం మూత్రపిండాలు, క్యాన్సర్‌కు కారణమౌతుందన్నారు. అందువల్ల ప్రజలు ఇటువంటి వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పడేయకుండా సంబంధిత రీసైక్లింగ్ చేసే వారికి మాత్రమే అప్ప చెప్పాలని కోరారు.

దర్గా ఆస్తులపై విచారణ దేనికి సంకేతం

కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంఐఎం నాయకుడు

నరసరావుపేట: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింలు రోడ్డు ఎక్కి రద్దుచేయాలని నిరసన ర్యాలీ చేస్తున్నా జాలి, దయలేని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దొరికిందే చాన్స్ అన్నట్లుగా అధికారులను దర్గా ఆస్తులపై విచారణకు పంపటం దేనికి సంకేతమని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి ప్రశ్నించారు. మంగళవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. కుల మతాలకు అతీతంగా గుంటూరు మస్తాన్‌దర్గా నిర్వహణకు రావి రామ్మోహనరావు అనే వ్యక్తి ఎన్నో ఏళ్లుగా ధర్మకర్తగా ఉన్నారని, ఇప్పుడు చట్టం చేశారని, అమలు చేయాలనీ కొంతమంది వక్ఫ్ అధికారులమంటూ దర్గా ఆస్తులనీ స్వాధీనం చేసుకోవడం కోసం రావడం కరెక్ట్ కాదని తెలిపారు. ఇప్పుడు జరుగుతున్న నిరసనలకు ఈ ప్రక్రియ అగ్నికీ ఆజ్యం పోసేటట్లుగా అధికారులు చర్యలు ఉన్నాయని మౌలాలి పేర్కొన్నారు. అధికారుల తొందర పాటు చర్యలవల్ల ముస్లిం సామాజిక వర్గం ఇంకా ఆందోళన చెందుతుందని, కాస్త ఓపిక పట్టాలని మౌలాలి కోరారు.

ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి



ఎంఈవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిలకలూరిపేట: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని ఎస్టీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎం కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్ కోరారు. ఎస్టీయూ సంఘ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఈవో ఎ శ్రీనివాసరావును కలసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని వడ్డెరకాలనీ, మద్దినగర్, దాసరి కాలనీ, రజకకాలనీలలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. టిడ్కో గృహ సముదాయం వద్ద నూతన పాఠశాల ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కూల్ హెచ్‌ఎంలపై పని ఒత్తడి తగ్గించి ఆఫీసు సిబ్బందితో రికార్డులు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయ సర్వీస్ రిజిస్టర్ అప్‌డేట్ చేయాలన్నారు. తమ సంఘం పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపుకై కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పోటు శ్రీనివాసరావు, వినుకొండ అక్కయ్య, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ములకలూరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నూజెండ్ల: సాంఘిక, ఆర్థిక పరమైన అసమానతలతో నిరంతరం పోరాడుతూ స్వయంకృషితో ఎదిగిన మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేద్కర్ అని సర్పంచ్ కంచర్ల వెంకటేశ్వర్లు (బాబు) అన్నారు. మండలంలోని ములకలూరు గ్రామంలోఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, బానిసత్వం, అస్పృశ్యత నిర్మూలన, కుల వివక్షతపై అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడన్నారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ళరాజు మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పనలో అన్ని వర్గాలకు సమాన హోదా కల్పించిన దార్శనీకుడు బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మందా లింగయ్య, అంకులు, కోటేశ్వరావు, వెంకట్రావు, దావీదు, యోగారాములు, వారణాసి పాల్గొన్నారు.

రాజశేఖర్ మాస్టారు ఇకలేరు



రాజశేఖర్ ఫైల్

యడ్లపాడు: స్థానికుల మదిలో ఎంతో గౌరవాన్ని పొందిన యడ్లపాడు వాసి తెలగతోటి రాజశేఖర్ (63) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం హెచ్ఎంగా పనిచేసిన రాజేశ్వరరావు, ఇదే పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహించిన కనకవల్లి దంపతుల పెద్దకుమారుడైన రాజశేఖర్ పలు ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్, పీఈటీగా కొనసాగారు. యడ్లపాడులోని అనేక మంది విద్యార్థులకు ఉచితంగా ఆంగ్ల భాషపై పట్టుసాధించేలా కృషి చేశారు. విద్యాపరంగా అనేక సేవలు అందించారు. రాజశేఖర్ భార్య ఇదే మండలం బోయపాలెం గ్రామంలోని వేదపాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు,. కొద్ది రోజులుగా లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రాజశేఖర్‌ను కుటుంబ సభ్యులు గుంటూరులోని అమెరికన్ అంకాలజీ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు.

ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆయన కన్నుమూశారు. మృతి విషయం తెలుసుకున్న గ్రామస్తులు, టీచర్లు వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. బుధవారం రాజశేఖర్ భౌతికకాయాన్ని యడ్లపాడులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.